ఒక సంఘటన

ఇంటి ముందొక కారు ఆగింది. ఒక యువకుడు లోపలికి వచ్చి అడిగాడు, "రుక్మిణమ్మగా రున్నారా?" అని.

లలిత చటుక్కున నిలబడి చీర సవరించుకుంటూ కొంచెం ఖంగారు పడుతూ అంది: "లోపల స్నానంచేస్తోంది. ఇప్పుడే వస్తుంది. కూర్చోండి" అని కుర్చీ చూపించింది.

అమితమైన సిగ్గు ఆమె నావేశించింది. సంధ్యాకాలపు తమ్మిపువ్వులా, ఆమె తనలోకి తను ముడుచుకుపోయింది. ఈ యువకుడిరాక, దాని ఉద్దేశం తన అక్క తనతో ముందే చెప్పడంచేత ఆమె తన సహజమైన సమతని నిలబెట్టుకోలేకపోయింది.

యువకుడు చిఱునవ్వు నవ్వుతూ కూర్చున్నాడు-అప్పుడప్పుడు లలితవంక చూస్తూ.

"ఓహో ! అప్పుడే వచ్చారా మీరు ? నే నింకా మొదటి ఘట్టం లోనే ఉన్నాను" అంటూ రుక్మిణి స్నానపు గదిలోంచి బయటికి వచ్చింది.

"ఆడవారికి ఒక పట్టాన్ని తెమలవు పనులు" అని ఆ యువకుడు లలితవంక తిరిగి చిఱునవ్వు నవ్వాడు.

"లలితా! ఈయనే ప్రసాద్ గారు. శాంతినికేతనంలో బి. ఏ. ప్యాసయినారు. మంచి చిత్రకారుడు." అని రుక్మిణి తన చెల్లెలికి ఆ యువకుణ్ణి పరిచయం చేసింది.

లలిత రెండు చేతులూ కొంచెంగా మోడ్చి, మెల్లగా తనలో తను అనుకున్నట్టుగా "నమస్కారం" అంది. ప్రసాద్ దాన్ని అందు కున్నాడు.

అతని అసలు పేరు ప్రసాదరావు. శాంతినికేతనంలోకి వెళ్ళిం తరువాత, అతని వ్యక్తిత్వంతో పాటు అతని పేరు కూడా అవస్థాభేదం చెందింది.

రుక్మిణి క్వీన్ మేరీ కళాశాలలో ఉపాధ్యాయిని. లలిత ఇంటర్ మీడియేటు చదువుతోంది ఆ కళాశాలలోనే. ఆ అప్పచెల్లెళ్ళలో సామ్యం ఏమీ లేదు. ఒక తల్లితండ్రులకి పుట్టిన ఆడపిల్లలలో అంత స్వభావభేదం ఉండడం ఒక వింత. రుక్మిణీ కొంచెం లావు. ఏదో ప్రకృతి దోషంవల్ల మగవాడయి పుట్టవలసి ఆ మరిచిపోయి ఆడదిగా పుట్టినట్టు ఆమె కనిపిస్తుంది. వేగం ఆమె స్వభావం. ఆమె సంభాషణలో చాతుర్యం ఏమీ ఉండదు. ఆమె హాస్యం గంభీరంగా ఎప్పుడూ ఉండదు. ఆమె పకపకమని నవ్వినప్పుడు

ఆమెలో పురుష ప్రకృతి బాగా కనబడుతుంది. ఆమెకు తన ఆకారం సంభాషణాదికాలను గురించిన సంకోచం ఎప్పుడూ లేదు. అస లామె కా ధ్యానమే ఉండదు. లలిత మాత్రం కేవలం స్త్రీ. ఆమె చాలా తక్కువగా సంభాషిస్తుంది. ఆమె మనసు ఆమె కొక్కతెకే తెలుసును. ఆమె గట్టిగా ఎప్పుడూ నవ్వి ఎరగదు. ఒకవేళ నవ్వినా వెంటనే ఆపుకుంటుంది. పెదవులు బాగా విప్పి నవ్వడం ఆమెకు చాలా సంకోచం. ప్రతి అడుగూ జాగ్రత్తగా చూసుకుంటూ నడుస్తుంది. గాంభీర్యం ఆమె లక్షణం.

అడయార్ దివజ్ఞాన సామాజికులలో రుక్మిణికి చాలామంది స్నేహితులున్నారు. అప్పుడప్పుడు ఆమె ఇంటికి ఎవరో ఒకరు వస్తూనే ఉంటారు. ఆమె కూడా ఒక దివ్యజ్ఞాన సామాజికురాలే. కాని ప్రసాద్ ఆనాడు వారి ఇంటికి రావడంలో ఒక ప్రత్యేకత ఉంది. రుక్మిణి ఊరికే అతన్ని పిలవలేదు. అయితే తన ఉద్దేశాన్ని ఆమె ఇద్దరి దగ్గరా కూడా దాచలేదు. క్రితంరోజునే తన చెల్లెలితో చెప్పింది "ఇదిగో! చూడు! అతను రే పిక్కడకి వస్తాడు. చలాకీగా ఉండాలి. తెలిసిందా? మూతి ముడుచుకొని కళ్ళు కిందికి వంచుకుని కూర్చుంటే మాత్రం లాభం లేదు. చలాకీగా ఉన్న వాళ్ళని చూస్తే అతనికి చాలా ఇష్టం" అని.

అయినా దీనికి తగిన క్షమార్పణలు ప్రసాద్‌తో అంతకితమే చెప్పింది ఆమె. తన చెల్లెలికి చాలా సిగ్గనీ, తన సహాధ్యాయినులతోనయినా కలిసి మెలిసి తిరగదనీ, మనసు విప్పి ఎవరితోటీ మాట్లాడదనీ, కొంతవరకు ఉపోద్ఘాతం ప్రసాద్ ముందు అయింది. ఈ పరిచయం ఊరికే పోతుందని అనుమానం ఆమె కెప్పుడూ లేదు. తన చెల్లెలు చిత్ర రచనకి ఆదర్శ స్వరూపం. ప్రసాద్ చిత్రకారుడు!

చిత్ర రచనని గురించి రుక్మిణికి అట్టే ఏమీ తెలియదు. చిత్ర రచనలో ప్రసాద్ యొక్క విలువ అంతకంటే తెలియదు. ఆమె నాకర్షించింది అతని

స్థితిగతుల విలువ. అతని తండ్రి మద్రాసులో వకీలుగా చాలాకాలం పనిచేసి పేరు ప్రతిష్ఠలతోపాటు కావలసినంత డబ్బు సంపాదించాడు. చివరకి ఆయన తన వృత్తిమీదా అర్థంలేని అనుదిన ధనార్జనమీదా విసుగు చెంది, తన అంత్యదినాలని దైవచింతలో గడపాలనే మహదుద్దేశంతో ప్రశాంతమయిన అడయార్ వాతావరణంలో ఇల్లు కట్టుకున్నాడు. ప్రసాద్‌తో స్నేహం చెయ్యడానికి రుక్మిణి అట్టే కష్టపడలేదు: ఎంచేతంటే రుక్మిణిని ఎరగని వాళ్ళెవరూ అడయార్‌లో లేరు. ప్రసాద్ అందరి దృష్టికీ కేంద్ర వస్తువు. అతన్ని అందరూ, శాంతినికేతనపు కార్ఖానాలో తయారయిన ఒక వింత ఆట వస్తువుని చూసినట్టుగా చూస్తారు.

ఆనాటి ప్రథమ పరిచయం నిష్ఫలంగా పోలేదు. రాత్రి వారంతా సినీమాకి పోయారు. లలిత తన సిగ్గుని కొంతవరకూ లొంగదీసుకుని కొంచెం అప్పుడప్పుడు మాట్లాడింది. కాని మాట్లాడడం వంతు చాలామట్టుకు రుక్మిణిదే. ప్రసాద్ సమాధానంగా తల ఊపే వాడంతే. కాని రుక్మిణికి తన చెల్లెలు అతన్ని ఆకర్షించినట్టుగానే తట్టింది. ఆమె సంతోషాని కంతులేదు. వలలో చేప పడినప్పుడు పల్లెవా డెంత సంతోషిస్తాడో అల్లా ఆమె సంతోషించింది. అయినా, తన చెల్లెలు మాత్రం అంత తక్కువ ఎర కాదు.

క్రమంగా వారి పరిచయం అభివృద్ధి చెంది స్నేహంగా మారిందనీ, ప్రసాద్ వేళగాని వేళల్లో కూడా వారి ఇంటికి వస్తూ ఉండేవాడనీ, లలిత ప్రసాద్ దగ్గర బెంగాలీ నేర్చుకుంటోందనీ రుక్మిణికి తెలిసేసరికి ఆమె ఆశ్చర్యాని కంతులేదు. తన చెల్లెలికి పరాయి మగవారితో మాట్లాడేందుకు తగిన ధైర్యం లేదు. అల్లాంటప్పుడు, తనకి తెలియకుండానే వా రిద్దరూ చాలా సార్లు కలుసు కుంటున్నారని తెలియగానే, ఆమెకు సంపూర్ణ సంతృప్తితో ఆశ్చర్యం కూడా కలిగింది. వారిద్దరి స్నేహానికీ మూల మేదో ఆమెకు తెలియదు. తెలుసుకోడానికి ప్రయత్నం ఆమె ఎప్పుడూ చెయ్యలేదు. అంత

సిగ్గుగా ఉండే తన చెల్లెలు అతనితో సినీమాలకి ఎల్లా వెడుతూ ఉందో, బీచి రోడ్డుని అతనితో ఎల్లా తిరుగుతోందో ఆమెకు మాత్రం అర్థం గాలేదు. కాని ఈ ప్రశ్నని గూర్చి అట్టే ఆమె ఎప్పుడూ గట్టిగా ఆలోచించలేదు. ఆమెకు అర్థమయిందీ, ఆమె అర్థం చేసుకోడానికి ప్రయత్నించిందీ ఇంత వరకే—తన చెల్లెలి భవిష్యత్తు తన కాట్టే శ్రమ అక్కరలేకుండా స్థిరపడి పోతోంది.

2

లలిత కిటికీలో కూర్చుని, బయటి తోటలోకి పరధ్యాన్నంగా చూస్తోంది.

రుక్మిణి గబగబా లోపలికి వచ్చి, "నేను ప్రసాద్ ఇంటికి వెడుతున్నాను, నువ్వు కూడా వస్తావా?" అని అడిగింది.

"రాను" లలిత మళ్ళీ బాహ్య ప్రపంచంలోకి వచ్చింది.

రుక్మిణి లలిత పక్కని కూర్చుని నెమ్మదిగా ఆమెను బుజ్జగిస్తూ సగం కౌగిలించుకుని, "మరేమీ ఫరవాలేదే. అతనికి తన స్టూడియోలో పని ఎక్కువ తొందరగా ఉంది. అంచేత రావడం లేదుగాని మరి ఇంకో కారణం ఏమీ లేదు. అతన్ని గురించి దుష్టప్రచారం చేసే వారందరి కంటె అతన్ని నేను చాలా బాగా ఎరుగుదును" అంది.

లలిత చిరాకుగా లేచింది. "ఆయన కిక్కడికి రావడానికి వీలు లేక పోతే, అక్కడికి వెడితే మాత్రం వీలెలా ఉంటుంది? ఆయన్ని అనవసరంగా కష్టపెట్టడానికి నా కిష్టంలేదు. అయినా వస్తే ఏం, రాకపోతే ఏం ?"

రుక్మిణి లేచి వెళ్ళిపోతూ, "కాముకు లెంత తమాషా మనుష్యులో

గదా!" అనుకుంది. ప్రతీ చిన్న విషయం వారిని తలక్రిందు చేస్తుంది. అయినా, అది చచ్చినా ఒప్పుకోరు వాళ్ళు!

ప్రసాద్ ఒక నెల రోజులనుంచి వారిని చూడ్డానికి రావడంలేదు. అతని రాకపోకలతో తనకేమీ ప్రమేయం లేదని తన్ను తాను లలిత ఎంత సమాధానపరుచుకున్నా, ఆమె ఎప్పుడూ కారణాలూ, వాటి ఫలితాలా ఆలోచిస్తూనే ఉంది.

ప్రసాద్‌కి దూరపు చుట్టం ఒక అమ్మాయి ఉంది. ఆమె పుట్టక క్రితమే ఇతని కామె నివ్వడానికి మాటలు జరిగాయి - వేళాకోళంగానే ననుకోండి. కాని చిన్ననాటి వేళాకోళాలు పరిస్థితులు మారకుండా ఉంటే నిజాలవడానికి చాలా సావకాశా లున్నాయి. ఆమెకిప్పుడు పదమూడో ఏడు, శారదా బిల్లు వయస్సుకు అట్టే తక్కువ లేదు. కాని ఆమె వాటాకి లక్ష రూపాయల ఆస్తీ, ఆమె వయస్సులో కొరతని బాగా పూడ్చి వేస్తుంది. ప్రసాద్ తండ్రికి ఆ పిల్ల బాగా నచ్చింది. శారదా బిల్లు అంతగా బాధించదు. పెళ్ళిళ్ళన్నీ ప్రేమ మీదే ఆధారపడి ఉండాలని ఆయన నిరభ్యంతరంగా ఒప్పుకుంటాడుగాని, తన కొడుకు ఈ పిల్లని ప్రేమించగలగడం విషయంలో ఆయన కేమీ అనుమానం లేదు. ఎంచేతంటే పిల్ల చాలా బాగుంటుంది, మంచిది. ఈ పదమూడేళ్ళ పిల్లని తను పెళ్ళాడడం అసంభవమనిన్నీ, ఏమీ ఎరగనటువంటి ఒక చిన్న పిల్లని వివాహబంధంలో బంధించి ఆమెను మోసగించే మహాపాతకానికి తను కారణభూతుడు కాలేడనిన్నీ తన తండ్రితో నిష్కర్షగా ప్రసాద్ చెప్పివేశాడని మద్రాసులో నాలుగుమూల్లా చెప్పుకుంటున్నారు. బాల్యవివాహాలను గురించి అతని అభిప్రాయాలని అతడు స్పష్టంగానే చెప్పివేశాడట. బాల్యవివాహాలవల్ల బాల వితంతువులు తయారవుతున్నారని అతని నమ్మకం — అయితే, ఈ పిల్లని పెళ్ళాడినందువల్ల తన భవిష్యత్తుని గూర్చిన సూచన ఏమీ ఇందులో లేదు. కాని తను సంఘ

సంస్కర్త అయినందువల్ల దాన్ని ఒక ప్రాతిపదిక సూత్రంగా అత డంగీక రిస్తాడట. అతని తండ్రి మాత్రం ఈ సమాధానం విన్న తరవాత ఉగ్రుడై, తన ఇష్టానికి వ్యతిరేకంగా గనక అతడు నడుచుకున్నట్టయితే, తన సంపా దనలో దమ్మిడీ అయినా అతనికి దక్కదని శ్రీముఖం ఇచ్చాడట!

లలిత ఈ సంగతులన్నీ విన్నతరవాత ఆమె మనస్సులో సందేహం, సంతృప్తీ దెబ్బలాడుకున్నాయి.

నలుగురూ మాట్లాడుకునే మాటల్లో ప్రసాద్ పేరూ తన పేరూ కలియటం ఆమె చాలాసార్లు నిర్లక్ష్యంగా వింది. అయినా వారిద్దరి మధ్యా ఏ విధమయిన మాటలూ జరగలేదు. ప్రసాద్ ఆ సంభాషణల నన్నింటినీ ఏ దృష్టితో చూస్తున్నాడో ఆమెకు తెలియదు.

ప్రసాదంటే తన కిష్టంలేదని గాదు, పరిస్థితు లనుకూలంగా పరి ణామం చెందినా అతన్ని కాదని త్రోసివేస్తుందనీకాదు. కాని లేనిపోనివన్నీ కల్పించి మాట్లాడుకోడానికి సంఘానికేమి అధికారం ఉంది ? ప్రసాద్ వంటి యువకులు అరుదే. అతనికి ధనసంపత్తే ప్రధానంగాదు. ఏ లక్షణాలు యువ కుల్ని ఆదర్శప్రాయులుగా, యువతి ప్రేమకు పాత్రులుగా చేస్తాయో, అవన్నీ అతనిలో ఉన్నాయి. కాని, అతన్ని తన వలలో వేసుకుందామనే నీచోద్దేశంతో అతని స్నేహం ఆమె కాంక్షించలేదు. వా రిద్దరికీ మధ్య నున్నది పరిశుద్ధమైన మైత్రి - ప్రపంచంలో వ్యక్తికీ వ్యక్తికీ మధ్య ఉండే పవిత్రబంధం. వారి స్త్రీ పురుషభేదం కేవలం ఒక సంఘటన. వివాహ సంబంధమయిన చర్చ ఎప్పుడూ వా రిద్దరి మధ్యా రాలేదు. ఆ విషయంలో అతని ఇష్టం అతనిది.

కాని అతడు తన దూరపు బంధువైన ఆ పిల్లని బహిరంగంగా నిరా కరించాడు. ఎంచేత? లలితమీద ప్రేమయే దీనికి కారణమా ? ఈ మధ్య అతడు తనని చూడ్డాని కెందుకు రావడంలేదు?

ఒకవేళ మొదట్లో అతని కేమన్నా ఉద్దేశం ఉందేమో ! ఈ నూతన ఘట్టాలన్నీ వచ్చిం తరవాత తనను చూడడాని కతడు సంకోచిస్తున్నాడేమో !

లలితకి తెలియకుండానే చీకటిపడింది. ఆమె హృదయం ఆ చీకటి యొక్క నిశ్శబ్దంలో గబగబా కొట్టుకుంది. ఆ దూరపు ఆకాశంలో నీలి లోతులూ, ఆ మిణుకుమనే లెక్కలేని తారకా హృదయాలూ, ఈ ఒక్క మానవాదర్శ విఘాతానికే విషాదంతో నిండిపోయాయి.

దాసి వచ్చి వెలిగించిన దీపాన్ని ఆర్పివేసి భోజనం చెయ్యకుండానే ఆమె పక్కమీదికి పోయి పడుకుంది. దీపపు వెలుతురు ఆమె మనోనేత్రాలని మిరుమిట్లు గొలిపింది. ఆమె తన భావనా వేగాన్ని సరిగా గ్రహించడానికి వెలుగు అడ్డుపడింది. అంచేతే ఆమె దీపం ఆర్పివేసింది. ఆ చీకటితో అనంత స్వప్న ప్రపంచంలోకి ఆమె వెళ్ళిపోయింది. ఆ నల్లటి తెరమీద తన మన స్సంతృప్తి కలిగించే బొమ్మలు చిత్రించుకుంది. తనకి ఇష్టమయిన కథలు వ్రాసుకుంది.

పగటి వెలుగు ఆమె సహించలేకపోయేది. ఆదుర్దాగా రాత్రి కోసం ప్రతిరోజూ ఎదురుచూస్తూ ఉండేది. ఆ చీకటి తెరమీద తను వ్రాసుకున్న భావాలలో మునిగిపోయేది.

3

ప్రసాద్ ఒకవేళ ఆ పదమూడేళ్ళ పిల్లని పెళ్ళాడితే, తనకేమీ లక్ష్యం లేదని, లలిత అస్తమానూ తనలో తను స్థిరపరుచుకోడానికి ప్రయత్నించేది. సంఘం, వీళ్ళమీదా వాళ్ళమీదా ఏవో చెప్పుకుని రహస్యంగా సంతోషిస్తుంది. సంఘం ఒక తమాషా జంతువు. లలిత అప్పుడే మూడునెల్లక్రితమే ప్రసాద్

భార్య అయిపోయినట్టు నిన్న మాట్లడిన సంఘమే, ఈనాడు ప్రసాద్, ఆ పదమూడేళ్ళ పిల్లనీ, ఆమె వెనకనే తప్పిపోకుండా వచ్చే సిరిసంపదలనీ ఎల్లా గ్రహిస్తాడో వింతగా చెప్పుకుంటోంది.

కాని తన అక్కకెందు కంత ఆదుర్దా ? ఏదో ఇదివరకే అంతా నిశ్చయ మయిపోయినట్టుగానూ, ప్రసాద్ ఇప్పుడు మాట తప్పిన నేరానికి పాత్రు డయినట్టుగానూ ఆమె మాట్లాడుతుంది. అప్పుడప్పు డామె లలిత దగ్గరకు వచ్చి, ఏదో మించిపోయినట్టుగా గొంతుకు పెట్టి, "నువ్వెంత బాధ పడుతున్నావో నాకు తెలుసునే తల్లీ! అయినా నా శక్తికొద్దీ ప్రయత్నం చేస్తాను. చూడు మరి. అత దేదన్నా నిశ్చయించుకునేముందు ఎన్ని సంగతు లాలోచించుకోవాలి?...." అంటూ చెపుతుంది.

ముఖం చిట్లించి ఇదంతా విని, లలిత కొంత సేపటి కంటుంది, "ఏమిటే ఇదంతానూ? ఆయనకోసం నేనేమీ పడి చచ్చిపోవడం లేదు, ఆయ నిష్టం ఆయనిది. మధ్య నే నెవరిని?"

రుక్మిణి మొగంమీద ఆందోళన ముద్రించినట్టు కనబడుతుంది. ఆమె నడవడిలో చాపల్యం కనబడుతుంది. తన చేతుల్లోంచి దాటిపోయే ఒక పిట్టని పట్టుకోడానికి నిస్పృహతో ఎగురుతూ ఉన్నట్టుగా ఉంది ఆమె ధోరణి.

"అయినా అతడు మంచివాడే. కాని పైని తండ్రి ఉన్నాడు. సరే, చూద్దాం పెళ్ళి ఇప్పు డెల్లా అవుతుందో. క్రొత్త శారదా బిల్లుకూడా వచ్చింది గదా. ఇంకా ఏడాది పైగా ఆగాలి అతను. ఈలోగా ఎన్ని మార్పు లయినా రావచ్చు" అని తన మనస్సులోని ఆలోచనలని పైకి అనేస్తూ ఉంటుంది ఒక్కొక్కసారి.

లలిత వెంటనే, చాలా విసుక్కున్నట్టుగా, "నీకు మొత్తంమీద మతి పోయినట్టుగా ఉంది. నన్ను పెళ్ళిచేసుకుంటానని ఆయ నేమన్నా రాసి

ఇద్చారా ఏమిటి? అసలా సంభాషణే ఎప్పుడూ రాందే ? ఆయన ఉద్దేశం ఏమిటో మన కసలు తెలియదు. ఊరికే స్నేహరీత్యా మన ఇంటి కాయన వచ్చేవాడు. అంతే" అనేది.

కాని అది "అంతే!" కాదని లలిత మనస్సుకే తెలుసును. ఆమె హృదయంలో లోతుగా ఒకమూల, ఆ స్నేహం ఊరికే నిమిత్త మాత్రం గాదనే విశ్వాసం గాఢంగా నాటుకుపోయి ఉంది.

ఆమె భావనా ప్రపంచంలో అతడు ఏ మృదు తల్పంమీదో, ఏ పండు వెన్నెల్లోనో, హృదయ వేదనచేత నిద్రరాక దొర్లుతూ ఉంటాడు. అతని మనస్సుని రెండు మహాశక్తులు రెండువైపులకీ లాగుతున్నాయి. ఒకటి ప్రేమశక్తి: రెండవది, తండ్రి ఆజ్ఞాపాలనం. రెండవ ప్రక్క ఇంకొక బలం కూడా ఉంది—ఆ పిల్ల ఆస్తి. ఆ ఆకర్షణని ఆపగలిగినంత శక్తి ఆతని ప్రేమకి ఉందా లేదా అని ఆమె ఆలోచించుకుంటూ ఉంటుంది.

ఎప్పుడో ఒకప్పుడు ఆ మహా సంఘర్షణచేత రక్త పంకిల మయి పోయిన తన హృదయాన్ని విప్పి ఆమెకు చూపిస్తాడని ఆమె నిరంతరమూ ఆశిస్తూ ఉంది. ఎప్పుడో అతడు తన ప్రేమనిగూర్చి చెపుతాడు. తను పడిన బాధనంతనీ వర్ణిస్తాడు. ఆమె ముందు తన ముఖాన్ని చూపించడానికి ఎంత సంకోచించాడో, అయినా ఆ విలంబన అతని కెంత అసహనజనకంగా ఉండేదో అంతా వర్ణిస్తాడు. తప్పకుండా అతని బాధ, ఆమె బాధ కంటె చాలా గొప్పది. ఈ దీర్ఘ వాసరాలలో తను సహించిన బాధనంతనీ ఆమె తప్పకుండా మరిచిపోయి అతన్ని క్షమించగలదు.

4

"ప్రసాద్ దగ్గరనుంచి నీ కేమన్నా వచ్చిందా?" అని రుక్మిణి లలిత నడిగింది, ఎక్కడికో వెళ్ళడానికి తయారవుతూ.

"లేదు, అతడెందుకు రాస్తాడు? ఇంతకాలం రాయలేదు, ఇప్పుడంత ఏమి అవసరం వచ్చిందని రాస్తాడు?"

రుక్మిణి గబగబా ఎక్కడికో వెళ్ళిపోయింది. లలిత ఆలోచిస్తూ పడక కుర్చీలో పడుకుంది.

కొంత సేపటికి ఎవరో ఒక నౌఖరు వచ్చి ఆమె చేతికొక ఉత్తరం ఇచ్చి వెళ్ళిపోయాడు. లలిత ఉత్తరం విప్పింది.

అది ప్రసాద్ రాశాడు. ఒక గంటక్రితమే తన అక్క అడిగింది-అతని దగ్గరనుంచి ఏమన్నా ఉత్తరం వచ్చిందా అని. ఇప్పుడే ఉత్తరం వచ్చింది. దీని అర్థం ఏమిటీ?

"శ్రీమతి లలితకు,

"నేను చాలా కాలంనుంచి మీ యింటికి రాలేకపోయినందుకు చాలా విచారం."

ఎందుచేత?

"మన ఇద్దరి పేరులూ నలుగురి నోళ్ళలోనూ కలిసియి. ఈ సంగతి నీకు తెలిసే ఉంటుంది. దీనికి నేను కారణ భూతు ణ్నయాను."

అత నొక్కడే కారణభూతు డెల్లా అయాడు? ఆ బాధ్యత ఇద్దరిమీదా సమానంగానే ఉంటుందిగా.

"అందువల్ల విచారించాలో, సంతోషించాలో నాకే తెలియదు."

అబ్బ! ఎంతనిర్లక్ష్యం? ఇంత అసహ్యంగా ఉత్తరం రాస్తాడని ఆమె ఎప్పుడూ అనుకోలేదు. ఉత్తరమంతా శుద్ధనటన.

"నా అంతట నేను ఇప్పుడు చెప్పడాని కేమీలేదు. నేను నీకే విధమయిన బాధన్నా కలగజేశానేమోనని భయపడుతున్నాను."

ఓ! చాలా బాగుంది. అయితే ఇంక ఈ ఉత్తరం రాయడ మెందుకు ?

"నేను నిన్నే వివాహం చేసుకునే సందర్భంలో నీకోసం నే నెంత పోగొట్టుకోవాలో నీకు తెలిసే ఉంటుంది."

పోగొట్టుకోమని ఎవ రన్నారు ? తనేమన్నా సాష్టాంగపడి ప్రార్థించిందా ?

"నేను మీయింటి దగ్గర ఎల్లుండి నిన్ను కలుసుకుంటాను. అప్పటికి నే నేదో ఒకనిశ్చయానికి రాగలను."

ఇట్లు,
ప్రసాద్

లలిత తనకు తెలియకుండానే పళ్ళు కొరికింది. ఆమె చేతిలో ఆ ఉత్తరం నలిగి ఉండయిపోయింది.

గబుక్కుని కాగితం తీసి, తను రాయగలిగినంత వేగంగా ఆ ఉత్తరానికి జవాబు రాసింది.

"శ్రీయుతులు ప్రసాద్‌గారికి,

మీరు దయతో రాసిన ఉత్తరం అందింది. నా కోసం మీ రేమీ పోగొట్టుకో నక్కరలేదు. నేను మీ యెడల ప్రేమలో కుత్తుకబంటిదాకా మునిగిపోయి ఉన్నా ననుకోడానికి తగినంత సూచన లేవీ చెయ్య లే దను కుంటాను. ఒక సామాన్య స్నేహాన్ని మీ రింకొక విధంగా అర్థం చేసు కున్నట్టయితే, అది కేవలం మీ పొరపాటు. మీరు నాతో ఈ విషయమే మాట్లాడ దలచుకున్నట్టయితే మీరు ఎల్లుండి మా యింటికి శ్రమ తీసుకొని రానక్కరలేదు.

ఇట్లు,
లలిత."

వెంటనే సేవకుణ్ణి పిలిచి ఆ ఉత్తరం పోష్టులో వేయించింది.

కొంతసేపటికి రుక్మిణి ఎక్కడినుంచో ఆదుర్దాగా వచ్చి, "ప్రసాద్ దగ్గరనుంచి ఉత్తరం వచ్చిందా?" అని అడిగింది.

"ఆ. దానికి జవాబు కూడా రాశాను అప్పుడే?"

"ఏమని రాశావు?"

"ఏమనా?" లలిత త్రాచులా లేచింది. "తగిన సమాధానమే రాశాను. అంత అసహ్యంగా ఉత్తరం రాస్తే అర్థం ఏమిటీ ? నే నేదో కాళ్ళమీదపడి బతిమాలినట్టుగా అర్థం చేసుకున్నట్టున్నా డాయన."

రుక్మిణి స్థాణువులా నిలబడిపోయింది.

"ఏమి టీ వెఱ్ఱి? ఒక చిన్న తరుణం చేయిజారిపోయినా ఇంక లాభం ఏమీ ఉండదు. తెలుసునా?"

"తరుణాలకోసం ఎవరూ ఎదురు చూడ్డంలేదు. ఏమీలేనిచోట నువ్వు ఏదో గొడవలు కల్పిస్తావు. నువ్వు ఆయనచేత ఆ ఉత్తరం ఎందుకు రాయించావు ?"

ఇంక లలితతో మాట్లాడడంవల్ల లాభం లేదని రుక్మిణికి అర్థ మయిపోయింది. ఆమె తొందరగా వచ్చిన దారినే — పరిస్థితులు ఇంత కంటే సుళువుగా ఎక్కడయితే మార్చవచ్చో అక్కడికి గావును — వెళ్ళి పోయింది.

కాని లలిత ఆధైర్య స్థైర్యాలని అట్టే కాలం నిలుపుకోలేకపోయింది. రుక్మిణి వెళ్ళిపోవడంతోనే ఆమె, పరుపుమీద బోర్లగిల పడుకుని, తన ముఖాన్ని తలగడాలో దాచి చాలాసేపు ఏడ్చింది.

(భారతి, జనవరి 1939)